# ప్రిసైడింగ్ అధికారులదే కీలక పాత్ర

◆ కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్



శిక్షణ కార్యకమంలో పాలొన్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

వనపర్తి, అక్టోబర్ 31: ఎన్నికలు సజావుగా నిర్వహించడంలో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ ఆఫీసర్‌లదే కీలక పాత్రనని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. మంగళవారం వనపర్తి పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పీవోలు, ఏపీవోలకు నిర్వహించిన మొదటి విడుత శిక్షణ కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ తిరుపతిరావుతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రజల నమ్మకాన్ని నిలబెట్టడానికి ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించడం ఎంతో అవసరమని సూచించారు. ఎన్నికలు పారదర్శకంగా, సజావుగా సాగాలంటే పోలింగ్ రోజున ప్రిసైడింగ్ ఆఫీసర్ అన్ని నిబంధనలు తెలుసుకొని వాటిని పక్కాగా అమలు చేయాల్సి ఉంటుందన్నారు. తనపై తనకు గట్టి నమ్మకం, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాలనే సంకల్పంతో పనిచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. చిన్న తప్పు జరిగినా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు. అందుకే ఎన్నికల నియమావళి బాగా ఆకళింపు చేసుకోవాలని, అర్థం కాకున్నా చిన్న అనుమానం ఉన్నా.. శిక్షణలో నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. శిక్షణ కార్యక్రమం బాలికల ఉన్నత పాఠశాలలో ఉదయం 800మంది, మధ్యాహ్నం 800 మంది పీవోలు, ఏపీవోలకు మాస్టర్ ట్రైనర్‌తో శిక్షణ ఇచ్చారు.

***నామినేషన్‌లో జాగ్రత్తలు తీసుకోవాలి***

వనపర్తి, అక్టోబర్ 31: అభ్యర్థులు నామినేషన్ వేయడంలో పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి తిరుపతిరావు సూచించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో అన్ని పార్టీల ప్రతినిధులతో నామినేషన్ల ప్రక్రియ, వ్యయ సంబంధిత విషయాలు, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ ద్వారా పొందాల్సిన ముందస్తు అనుమతులు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి వంటి అంశాల పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎం.సీ.ఎం.సీ. నోడల్ అధికారి సీతారామ్, వ్యయ సంబంధిత నోడల్ అధికారి శ్రీనివాస్, తాసీల్దార్ యాదగిరి, పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ హత్యా రాజకీయాలు

◆ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్

◆ దుబ్బాక అభ్యర్థి ప్రభాకర్‌రెడ్డిపై దాడిని ఖండించిన బీఆర్ఎస్ నాయకులు

వనపర్తి, అక్టోబర్ 31: పచ్చని తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ హత్యా రాజకీయాలకు పాలపడటం హేయమైన చర్య అని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం మంత్రి నివాసంలో దుబ్బాక నియోజకవర్గ అభ్యర్థి ప్రభాకర్‌రెడ్డిపై సోమవారం జరిగిన హత్యాయత్నంపై ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, మార్కెట్ చైర్మన్ రమేశ్‌గౌడ్, మీడియా సెల్ కన్వీనర్ నందిమల్ల అశోక్‌తో కలిసి ఖండించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా సీఎం కేసీఆర్ ప్రశాంతమైన పాలన అందించారని పేర్కొన్నారు. అధికార ఆకాంక్షతో కాంగ్రెస్ నాయకులు హత్యా రాజకీయాలకు పాల్పడుతుండడం సిగ్గుచేటన్నారు. 100మంది రేవంత్‌రెడ్డిలు వచ్చినా తెలంగాణలో సీఎం కేసీఆర్‌ను ఏమి చేయలేరని, అలాగే బీఆర్ఎస్ అభ్యర్థుల విజయాన్ని ఆపలేరన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్త గంటరాజును బీజేపీ కండువా ఇస్తున్నట్లు ఫేక్‌గా సృష్టించి రాజకీయాలు చేస్తున్నారని, నిజాలు నిలకడగా ప్రజలందరూ గమనిస్తారన్నారు. బీఆర్ఎస్ సర్వేల ప్రకారం 70సీట్లు కాదు 110 సీట్లు వస్తాయని గంటాపదంగా తెలిపారు. అభ్యర్థులపై దాడి అనేది సినిమాలో చూసాం.. కాంగ్రెస్ పుణ్యమా ఇప్పుడు రాష్ట్రంలో చూస్తున్నామన్నారు. ఎన్నికలు వచ్చిన సందర్భాల్లో అధికార ఆకాంక్షతో దేశంలో అల్లకల్లోలం సృష్టించడంలో కాంగ్రెస్ పార్టీకి వెన్నతో పెట్టిన విద్య అని.. ఇప్పుడు ఇదేపనిని తెలంగాణలో కూడా మొదలుపెట్టిందన్నారు. ఓటమి ఆకళింపును జీర్ణించుకోలేక నేరుగా అభ్యర్థులపై దాడి చేస్తేనే భయపడతారన్న ఆలోచనతో దుబ్బాక అభ్యర్థి ప్రభాకర్‌రెడ్డిపై దాడి చేయించారన్నారు. ఏ పార్టీలో ఉన్నా మేమంతా తెలంగాణ బిడ్డలం అనుకుని సీఎం కేసీఆర్ శాంతియుతంగా పరిపాలన చేస్తున్నారన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాల ద్వారా సుపరిపాలన చేయడంతో బీఆర్ఎస్ ప్రభుత్వం ముచ్చటగా మూడోసారి అధికారంలోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో పట్టణ ఎన్నికల సమన్వయ కర్త అరుణ్‌ప్రకాశ్, రీజనల్ అథారిటీ సభ్యులు రమేశ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పరంజ్యోతి, నాయకుడు రమేశ్‌నాయక్, మీడియా సెల్ కన్వీనర్ నందిమల్ల అశోక్, పెబ్బేరు పట్టణ అధ్యక్షుడు దిలీప్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



మీడియా సమావశంలో మాట్లాడుతున్న బీ ఆర్ ఎస్ నాయకులు



శ్రీరంగాపూర్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ప్రమోద్‌రెడ్డి

***'ఎమ్మెల్యే అభ్యర్థిపై దాడి దర్మార్గం'***

శ్రీరంగాపురం, అక్టోబర్ 30 : ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడి చేయడం దుర్మార్గపు చర్య అని బీఆర్ఎస్ నియోజకవర్గం ఎన్నికల సమయంకర్త ప్రమోద్‌రెడ్డి ఖండించారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ మూడోసారి అధికారంలోకి వస్తుందని కాంగ్రెస్ కుటిల కుట్రలు చేసి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తుందన్నారు. మంత్రి నిరంజన్‌రెడ్డి గెలుపు కోసం ప్రతికార్యకర్త నిరంతరం కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వెంకటస్వామి, సింగిల్ విండో అధ్యక్షుడు జగన్నాథంనాయుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పృథ్వీరాజ్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో యువకుడు మృతి

గోపాల్‌పేట, అక్టోబర్ 31: విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందిన ఘటన రేవల్లి మండల కేంద్రంలో చోటుచేసుకున్నది. ఎస్సై శివకుమార్ కథనం ప్రకారం. రేవల్లి మండల కేంద్రానికి చెందిన తెప్ప భీముడు ( 35 ) రోజులాగే మంగళవారం ఉదయం వరి పంటకు నీరు పెట్టేందుకు పొలం వద్దకు వెళ్లాడు. బోరుకు విద్యుత్ సరఫరా రాకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. మృతుడి అన్న తెప్ప బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## గల్లంతైన మహిళ ఆచూకీకి గాలింపు

పెబ్బేరు, అక్టోబర్ 31: పెబ్బేరులోని జూరాల ప్రధాన ఎడమ కాల్వలో గల్లంతైన మహిళ ఆచూకీ కోసం అధికారులు ప్రయత్నిస్తున్నారు. సోమవారం బట్టలు ఉతికేందుకు వెళ్లిన షకీనాబేగం (25) ప్రమాదవశాత్తు కాల్వలో జారి నీటిలో కొట్టుకపోయింది. మంగళవారం సాయంత్రం వరకు ఆమె ఆచూకీ లభించలేదు. ఎస్సై జగదీశ్వర్, తాసీల్దార్ లక్ష్మి, మున్సిపల్ కమిషనర్ ఆదిశేషు తదితరులు సహాయక చర్యలు చేపట్టారు. ప్రస్తుతం కాల్వలో భారీగా నీటి ప్రవాహం కొనసాగుతున్నందున ఆమె ఆచూకీ లభించడం కష్టసాధ్యమవుతోంది. జూరాల అధికారులకు విన్నవించినప్పటికీ నీటి విడుదలను ఆపకపోవడంతో ఆగ్రహించిన ఆమె బంధువులు స్థానిక సుభాశ్ చౌరస్తాలో ధర్నా చేశారు. భర్త షేక్‌మహమూద్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ముమ్మరంగా బీఆర్ఎస్ ప్రచారం

పెబ్బేరు/గోపాల్‌పేట, అక్టోబర్ 31: మండలంలో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. పోలింగ్‌కు గడువు దగ్గర పడుతుండడంతో గ్రామాల్లో కార్యకర్తలు ఇంటింటి ప్రచారంపై దృష్టి పెట్టారు. ప్రతి గ్రామంలో ఉదయం, సాయంత్రం వేళల్లో వీధుల్లో తిరుగుతూ పార్టీ ప్రచారం నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా బీఆర్ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టో గురించి వివరిస్తూ ఓటర్లను ఆకట్టుకుంటున్నారు. గోపాల్‌పేట, రేవల్లి మండలాల్లో మంగళవారం బీ ఆర్ ఎస్ పార్టీ నాయకులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ, కరపత్రాలు పంచుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు.



అయ్యవారిపల్లెలో ప్రచారంలో బీఆర్ఎస్ కార్యకర్తలు

# బెల్టు షాపులపై ఉక్కుపాదం

- మద్యం అమ్మకాలపై పోలీసుల నజర్
- ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల రక్షణకే చర్యలు
- పెబ్బేరు మండలంలో 15 రోజుల్లో 5 కేసుల నమోదు

పెబ్బేరు, అక్టోబర్ 31: బహుషా బెల్టుషాపు లేని ఊరంటూ ఉండకపోవచ్చు! కానీ ఎన్నికలను సజావుగా నిర్వహించాలంటే శాంతిభద్రతల పరిరక్షణే ముఖ్యంగా పోలీసులు భావించారు. ఈ నేపథ్యంలోనే ఎక్కడ పడితే అక్కడ విస్తరించి ఉన్న బెల్టు షాపుల 'బెల్టు' తీస్తున్నారు! వైన్స్‌లు, బార్లలో మాత్రమే మద్యం విక్రయాలకు ప్రభుత్వ అనుమతి ఉంటుంది. కానీ..అధికారుల కళ్లు గప్పి ఎన్నో మద్యం దుకాణాలు అక్రమంగా కొనసాగుతున్నాయి. పట్టణాలు, గ్రామాలు అనే తేడా లేకుండా కిరాణా షాపులు, హోటళ్లు, కూల్‌డ్రింకు షాపుల్లో అక్రమంగా మద్యం విక్రయాలు జోరుగా సాగుతుంటాయి. కొన్ని చోట్ల మద్యం ప్రియులకు వసతులను కూడా ఏర్పాటు చేశారు. ఏ అర్ధరాత్రి వేళ తలుపు తట్టినా కోరిన మద్యం లభిస్తుంటుంది. ఇప్పటి వర కు జరిగిందేదో జరిగిపోయిందని పోలీసులు కఠిన చర్యలకు ఉపక్రమించారు. శాసనసభ ఎన్నికల షెడ్యూలు ప్రకటించినప్పటి నుంచి బెల్టు దుకాణాలను కట్టడి చేయనారంభించారు. జిల్లా వ్యాప్తంగా దాడులు చేస్తున్నారు. ఈ నేపథ్యం లో ఒక్క పెబ్బేరు మండలంలోనే ఈ పక్షం రోజుల్లో 15 కేసులు నమోదయ్యాయి. పెబ్బేరులో 3,చెలిమిల్లలో 5, గుమ్మడంలో 1, కంచిరావుపల్లిలో 4, అయ్యవారిపల్లెలో 1, తోమాలపల్లెలో 1 కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా రూ. లక్షా15వేల విలువ గల 214 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల దాడుల నేపథ్యంలో గ్రా మాల్లోని బెల్టుషాపుల యజమానులు బెంబేలెత్తిపోతున్నా రు. చాలా చోట్ల వేలం ద్వారా షాపులు దక్కించుకొని వ్యా పారం చేస్తున్నారు. పోలీసుల భయానికి కొన్ని గ్రామాల్లో షాపులను ముందే మూసేసుకున్నారు. ఎన్నికల్లో మద్యాన్ని కట్టడి చేయాలన్న ప్రధాన లక్ష్యంతోనే పోలీసు యంత్రాంగం కఠిన చర్యలకు ఉపక్రమించింది.




పట్టుకున్న అక్రమ మద్యంతో పెబ్బేరు పోలీసులు

### ఎన్నికలు ప్రశాంతంగా జరిపేందుకే..



ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన వెంటనే కోడ్ అమలులోకి వచ్చింది. ఎస్పీ ఆదేశాల మేరకు అక్రమ మద్యం విక్రయాలపై దృష్టి సారించాం. ఎన్నికలు ప్రశాంతంగా జరగాలంటే ముందు మద్యం విక్రయాలను కట్టడి చేయాలన్న లక్ష్యంతోనే బెల్టుషాపులపై దాడులు చేస్తున్నాం. ఎప్పుడు పడితే అప్పుడు మద్యం అందుబాటులో ఉంటే ఘర్షణలు జరిగే అవకాశాలు ఎక్కువ. అందుకే అక్రమ మద్యం వ్యాపారంపై ఉక్కుపాదం మోపుతున్నాం. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు తమ వంతుగా పోలీసులకు సహకరించాలి.

**- జగదీశ్వర్, ఎస్సై, పెబ్బేరు**